సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



సదస్సులో పాల్గొన్న అధికారులు, సైంటిస్టులు

ఏజీవర్సిటీ: ప్రతి ఒక్కరు సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత సబర్మతి టీకి అన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్‌లోని మేనేజ్‌లో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో మేనేజ్‌ పాత్ర అనే అంశంపై సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమలో సబర్మతి ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు.రసాయన ,సహజ వ్యవసాయం రెండింటికి సమానంగా మద్దతు ఇచ్చేలా పాఠ్యాంశాలు, పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.సహజ వ్యవసాయం ఆహార భద్రతకు హామీ ఇవ్వడమే కాకుండా నేల పోషకాలు, జీవన వైవిధ్య భద్రతను నిర్ధారిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌ డైరెక్టర్‌ జనరల్‌ చంద్రశేఖర్‌, పలువురు సైంటిస్టులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం



మహావీర్‌ కళాశాల సెక్రటరీని సన్మానిస్తున్న ఉస్మానియా సూపరింటెండెంట్‌ డాక్టర్‌ నాగేందర్‌

మైలార్‌దేవ్‌పల్లి: రక్తదానం చేయడంవలన ఇతరులకు ప్రాణదానం చేసిన వారమవుతామని మహావీర్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కళాశాల సెక్రటరి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని ఉస్మానియా దవాఖానలో సమావేశం నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో కో ఆర్డినేటర్‌ వీరేంద్ర పాటిల్‌తో పాటు విద్యార్థులు రక్త దానం చేయడంతో ఉస్మానియా సూపరింటెండెంట్‌ నాగేందర్‌ వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లో బక్రీద్‌ సందడి

ఇతర ప్రాంతాల నుంచి భారీగా గొర్రెల తరలింపు



నానల్‌నగర్‌ వద్ద అమ్మకానికి గొర్రెలు

గోల్కొండ: మార్కెట్‌లో బక్రీద్‌ సందడి నెలకొంది. ముస్లిం సోదరులు బక్రీద్‌ పండుగ రోజు గొర్రెలను ఖుర్బానీ ఇస్తారు. శుక్రవారం నుంచి రేతిబౌలి, రింగ్‌ రోడ్డు, టోలిచౌకీ చౌరస్తా, నానల్‌నగర్‌, షేక్‌పేట్‌ తదితర ప్రాంతాల్లో వేల సంఖ్యలో గొర్రెలు అమ్మకానికి వచ్చాయి. రాజస్థాన్‌ నుంచి ప్రత్యేకంగా పొడవు తోక గల గొర్రెలు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. చేవెళ్ల, జహీరాబాద్‌, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సైతం పెద్ద ఎత్తున గొర్రెలు అమ్మకానికి తరలివచ్చాయి. నగరంలో తెలంగాణ జాతి గొర్రెలకు మంచి డిమాండ్‌ ఉంది. అయితే ఈ సంవత్సరం గొర్రెల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గొర్రెల కంటే మేకపోతుల ధర ఎక్కువగానే ఉంటుంది. గొర్రెలను లైవ్‌ ధరలలో కూడా తూకం వేసి అమ్ముతున్నారు. పది కిలోల గొర్రెల రూ. 12–13 వేల రూపాయలు పలుకుతుంది. 12–15 కిలోల గొర్రెలు రూ. 13–16 వేల వరకు అమ్ముతున్నారు. అయితే ప్రత్యేకంగా బెల్లంతో పాటు కూరగాయలు తిని పెరిగిన గొర్రెలకు భారీ డిమాండ్‌ ఉంది. వీటి ధర ఇతర గొర్రెల కంటే రూ. 15 వేలు ఎక్కువగా ఉంటుంది.

విద్యతోనే మంచి భవిష్యత్తు

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ తదితరులు

శంషాబాద్‌: విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. పట్టణంలోని హుడా కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. నాణ్యమైన మంచి విద్యనందించేందుకు అధికారులు.. ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. బడికి దూరంగా పిల్లలను తప్పనిసరిగా బడిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హుడా కాలనీ ప్రాథమిక పాఠశాల పచ్చదనంతో పాటు సకల హంగులతో ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాంరెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సుష్మ, వైస్‌చైర్మన్‌ బండి గోపాల్‌ యాదవ్‌, జెడ్పీటీసీ సభ్యురాలు తన్వీ, కౌన్సిలర్లు కొనమొల్ల భారతమ్మ, మేకల వెంకటేష్‌; వై. కుమార్‌, పుష్పలత, రేఖ, జహంగీర్‌ఖాన్‌, విజయలక్ష్మీ బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీనివాస్‌, మురళి, దయానంద్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్‌ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపాలిటి వైస్‌ చైర్మన్‌ విజయబాబు అన్నారు. శుక్రవారం బడిబాటలో భాగంగా కోకాపేట్‌ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్‌ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ జి శివారెడ్డి, ఏఏసీపీ చైర్మన్‌ లక్ష్మమ్మ, భాగ్యలక్ష్మి బీజేపీ నాయకులు నాగేష్‌ యాదవ్‌, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఖానాపూర్‌ పాఠశాలలో..

మణికొండ: బడిబాటలో భాగంగా ఖానాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.నార్సింగ్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ నాగపూర్ణ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్‌ అమరేందర్‌రెడ్డి, ఉషారాణి శ్రీమతి ప్రవల్లిక, గండిపేట్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బఫర్‌ జోన్‌లో నిర్మాణాలు చేపడితే చర్యలు

గండిపేట తహసీల్దార్‌ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్‌..

బండ్లగూడ: బఫర్‌ జోన్‌లో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని గండిపేట మండల తహసీల్దార్‌ శ్రీనివాస్‌ రెడ్డి తెలిపారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 12వ తేదీన బఫర్‌ జోన్‌లో భారీ నిర్మాణాలు అనే శీర్షికకు తహసీల్దార్‌ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌ఐ విక్రమ్‌రెడ్డి ఈసీ పరీవాహక ప్రాంతాల్లో రాళ్లు, మట్టి కుప్పలను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతంలో కొందరు మట్టి, బండరాళ్లను డంప్‌ చేస్తున్నారన్నారు. వీటిని నివారించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు.



ఈసీ పరీవాహక ప్రాంతంలో మట్టి కుప్పలు, రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలి

నార్సింగి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ను కలిసిన కాంగ్రెస్‌ నాయకులు



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: నార్సింగ్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ నాగపూర్ణ శ్రీనివాస్‌ను వట్టినాగులపల్లి కాంగ్రెస్‌ నాయకులు కలిశారు. గ్రామంలోని పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా టీచర్స్‌ లేరని, అదే విధంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఒకేచోట ఉన్నందున సరిపడా గదులు లేవని సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు కుమ్మరి శేఖర్‌, బుడాల అరుణ్‌కుమార్‌, మంగలి యాదగిరి, కొండే సాయికుమార్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండగ.. సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్‌ నేత మురళి

శంషాబాద్‌: త్వరలో బోనాల పండగ సందర్భంగా మౌలిక సౌకర్యాలు కల్పించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు తోకల మురళి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మున్సిపల్‌ కమిషనర్‌ బి.సుమన్‌ రావుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పోచమ్మబస్తీలో పోచమ్మ ఆలయానికి వివిధ బస్తీల నుంచి వేలాది బోనాలు వస్తాయన్నారు. పోచమ్మ బస్తీలో రహదారుల సమస్యను పరిష్కరించడంతో బాటు పూర్తి స్థాయిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండగ సమయంలో హడావిడిగా చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు స్థానిక నేతలున్నారు.

నార్సింగి సహకార సొసైటీకి సీఈఓను నియమిస్తాం



డీసీసీబీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

మణికొండ: నార్సింగి సహకార సంగం సొసైటీకి త్వరలోనే నూతన సీఈఓను నియమిస్తామని రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌ కొత్త కురుమ సత్తయ్య అన్నారు.తెలంగాణ రాష్ట్ర టస్క్‌ బ్యాంకు నూతన వైస్‌ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను శుక్రవారం నార్సింగ్‌ సింగిల్‌ విండో చైర్మన్‌ తోలుకట్ట కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. గత కొన్ని రోజులుగా సొసైటీకి సీఈఓ లేకపోవడంతో సకాలంలో ప్రజలకు సేవలు అందించడంలో ఇబ్బందులు వస్తున్నాయని సీఈఓను నియమించాలని కోరారు. కార్యక్రమంలో హైదర్‌షాకోట్‌ సింగిల్‌ విండో చైర్మన్‌ రాందాస్‌ముదిరాజ్‌ ,ఇబ్రహీంపట్నం సింగిల్‌ విండో చైర్మన్‌ యాదగిరి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



మణికొండ: నార్సింగిలోని గండి పోచమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌ వెంకటేష్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో పుంజుకున్న బీజేపీ

గోల్కొండ: మోదీ పాలన మీద నమ్మకం, కార్యకర్తల సమష్టి కృషితోనే తెలంగాణలో బీజేపీ పుంజుకుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా నియమితులైన సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్‌ శుక్రవారం కేంద్ర మంత్రిని కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభంజనం ముందు రాష్ట్రాన్ని వరుసగా పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని అన్నారు. అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్‌ పార్టీ తెలంగాణలో సీట్లపరంగా బీజేపీకి పోటీ ఇవ్వలేకపోయిందని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

ఏజీవర్సిటీలో వైద్యశిబిరం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.హైదరాబాద్‌లోని ఇండో బ్రిటీష్‌ అడ్వాన్డ్స్‌ పెయిన్‌ క్లీనిక్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 150 మందికి బోన్‌ మినరల్‌ డెన్సిటి పరీక్షలు నిర్వహించారు.వివిధ రకాల నొప్పులకు సంబంధించి మందులు ఇచ్చారు. పెయిన్‌ స్పెషలిస్టులు డాక్టర్‌ పి నిఖిత, డాక్టర్‌ చైతన్య, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి, జె సత్యనారాయణ,సి నరేంద్రరెడ్డి ,సి పద్మవేణి పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

బండ్లగూడ: డివిజన్‌ పరిధిలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ 18వ డివిజన్‌ కార్పొరేటర్‌ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్‌ శుక్రవారం జలమండలి మేనేజర్‌ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ త్వరలోనే సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సరస్వతీ కాలనీ ప్రెసిడెంట్‌ మల్లేష్‌, మాచనపల్లి ఎన్‌క్లేవ్‌ ప్రెసిడెంట్‌ నరేందర్‌గౌడ్‌, శంకర్‌నాయక్‌, శివకుమార్‌, ప్రవీణ్‌, విఠల్‌రెడ్డి, ఎస్‌.సత్యం పాల్గొన్నారు.



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌

స్కూలు బస్సులు తనిఖీ



పాఠశాలల బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్‌: రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు శుక్రవారం రాజేంద్రనగర్‌, అప్పా చౌరస్తాలలో స్కూల్‌ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 11 బస్సులను సీజ్‌ చేశారు. రాజేంద్రనగర్‌లో స్కూల్‌ బస్సుల పర్మిట్‌ లేకపోవడంతో పాటు డ్రైవర్‌కు లైసెన్స్‌ లేకపోవడంతో మూడు బస్సులపై కేసు నమోదు చేసి సీజ్‌ చేశారు. అప్పా చౌరస్తా వద్ద 12 స్కూల్‌ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో సీజ్‌ చేసినట్లు అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా రవాణా శాఖ అధికారులు స్కూల్‌ బస్సులపై ముమ్మరంగా దాడులు చేస్తున్నారు.

బండ్లగూడ: పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్‌ కలిగిన బస్సులను ఉపయోగించాలని రంగారెడ్డి జిల్లా ఉప రవాణా అధికారి చంద్రశేఖర్‌ సూచించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని తెలంగాణ పోలీస్‌ అకాడమీ సమీపంలో పాఠశాలల బస్సులను క్షుణంగా తనిఖీలు చేశారు. బస్సులకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్‌ లైసెన్స్‌ తదితరాలను తప్పకుండా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు తరలించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పది బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రికి మరిన్ని హంగులు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిని మరిన్ని హంగులతో అభివృద్ధి చేయిస్తానని కార్వాన్‌ ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. శుక్రవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. త్వరలోనే ఆసుపత్రికి కొత్త భవనాల నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో కూడా తాను ఎన్నో నిధులు సాధించానని తెలిపారు. మజ్లిస్‌ పార్టీ అధ్యక్షులు అసదుద్దీన్‌ ఒవైసీ సైతం ఆసుపత్రిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో పార్కింగ్‌ విషయంపై తాను ఉన్నతాధికారులతో మాట్లాడి పార్కింగ్‌ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన ఏ ఒక్క రోగికి కూడా అసౌకర్యం కలగకుండా ఆసుపత్రి సిబ్బంది కృషి చేయాలని ఆయన అన్నారు. ఆసుపత్రి ఓపీ విభాగం, ఆపరేషన్‌ థియేటర్‌, ఔట్‌ పేషెంట్‌ విభాగాలలో శుభ్రత ఉండాలని ఆసుపత్రి అద్దంలా మెరవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో జరుగుతున్న సర్జరీలు, ప్రసవాలు తదితర విషయాలపై ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మహ్మద్‌ మజహరుల్లాను అడిగి తెలుసుకున్నారు.

'సన్నాల'కే సై



యెట్టిగడ్డసంగం గ్రామ శివారులో సాగుచేసిన సన్న రకం వరి (ఫైల్‌)

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్‌ అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆ పంటను సాగు చేయడానికి రైతులు ఉత్సాహం చూపుతున్నారు. వచ్చే వానాకాలం సీజన్‌ నుంచే ఈ పథకం అమలు చేయాలని సర్కార్‌ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో సన్నరకం వరి సాగు గణనీయంగా పెరగనుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్‌ ప్రభుత్వం తెల్లరేషన్‌ కార్డుదారులతో పాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలోని రైతులను ప్రోత్సహిస్తూ సన్నాల సాగు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సన్న రకాల వడ్లకు బోనస్‌ ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోనూ సన్నాల వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం

గత యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 98,987ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఈ వానాకాలంలో 1.41లక్షల ఎకరాల్లో సాగు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అయితే బోనస్‌ ప్రకటనతో ఈ సారి లక్ష్యానికి మించి దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి పంట సాగయ్యే పరిస్థితి కనిపిస్తుంది. సాధారణంగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడులు తక్కువే. దొడ్డు రకాలు ఎకరానికి సగటున 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అదే సన్న రకాలైతే ఎకరానికి 15నుంచి 20బస్తాల దిగుబడి మాత్రమే ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నాల సాగు సమయంతో పాటు చీడపీడలు బెడద కూడా ఎక్కువే.

డిమాండ్‌ ఎక్కువే..

ధర విషయానికి వచ్చేసరికి సన్నాలకు ఎక్కువ డిమాండ్‌ ఉంటుంది. దొడ్డు రకానితో పోలిస్తే సన్నాల ధాన్యం క్వింటాల్‌కు దాదాపు రూ.600 అధిక ధర లభిస్తుంది. గత యాసంగిలో సన్నాలు సాగు చేసిన రైతులంతా తమ పొలాల వద్దే పంటను అధిక ధరకు అమ్ముకున్నారు. దొడ్డు రకాలు క్వింటాల్‌కు రూ.1,850కు కొనుగోలు చేయగా, సన్నాలు మార్కెట్‌లో రూ.2,400కు పైగా ధర పలికింది. మార్కెట్‌కు తీసుకు వెళ్లకుండానే పొలాల వద్దే ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అవసరమైన సన్న బియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్‌ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్‌ వర్తింపజేయాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారు.

పెరగనున్న వరి సాగు

- రూ.500 బోనస్‌ ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో ఉత్సాహం
- గత యాసంగిలో 98,987 ఎకరాల్లో వరి
- ఈ వానాకాలంలో 1.41లక్షల ఎకరాల అంచనా

రైతు ప్రభుత్వం



కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోంది. సన్నాలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తూ రూ 500బోనస్‌ ప్రకటించింది. సన్నాల పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– కుమార్‌ గౌడ్‌, మాజీ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌, సదాశివపేట

దొడ్డు వడ్లకూ ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వం కేవలం సన్నవడ్లకు మాత్రమే రూ. 500 బోనస్‌ ఇస్తామని చెప్పడం సరికాదు. దొడ్డు వడ్లకూ ఇవ్వాలి. నీటి వనరులు తక్కువగా ఉండడంతో జిల్లాలో సన్నరకం వడ్లు అందరూ సాగు చేయడానికి అవకాశం ఉండదు.

–పట్లోళ్ల మల్లేశం, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు, కొండాపూర్‌

'ఐఎస్‌ఐ' ఫలితాల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ

రాయదుర్గం: ఇండియన్‌ స్టాటిస్టికల్‌ ఇన్‌స్టిట్యూట్‌(ఐఎస్‌ఐ) ప్రకటించిన ఫలితాలలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి ప్రతిభ చాటాడు. కళాశాలకు చెందిన విద్యార్థి జాడీ రేవంత్‌ ఆలిండియా ర్యాంకు 137, కేటగిరి ర్యాంకు 4, హైదరాబాద్‌ రీజియన్‌లో మొదటి ర్యాంకును సాధించడం విశేషం శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్‌ డి గణేష్‌ మాట్లాడుతూ ఐఎస్‌ఐ ప్రకటించిన ఫలితాలలో తమ విద్యార్థి రేవంత్‌ అత్యంత ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రేవంత్‌ను, ప్రిన్సిపల్‌ గణేష్‌, అధ్యాపక బృందాన్ని గురుకుల కళాశాలల కార్యదర్శి సీతాలక్ష్మీ, హెచ్‌ఆర్‌ఆర్‌ వెస్ట్‌ ఆర్‌సీఓ శారదా వెంకటేష్‌, అదనపు కార్యదర్శి సక్రునాయక్‌ అభినందించారు.

రేపు ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ

సుల్తాన్‌బజార్‌: నారాయణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన కింగ్‌కోఠిలోని ఈడెన్‌ గార్డెన్‌లో ఎంపికైన 800 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చనున్నట్లు సంస్థాన్‌ ట్రస్ట్‌, డైరెక్టర్‌ దేవేంద్ర చౌబిసా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రతినిధులు రిదేష్‌ జాగిర్దార్‌, అల్కా చౌదరి, జస్మత్‌బాయి పటేల్‌, ఉత్తమ్‌ జైన్‌, భగవాన్‌ ప్రసాద్‌ గౌడ్‌లతో కలిసి శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీన మంత్రుల సమక్షంలో వారికి కృత్రిమ అవయవాలు అమరుస్తామని తెలిపారు.

భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ యూనివర్సిటీ రహదారి గుండా భవానీ కాలనీ, శివరాంపల్లి వరకు రాత్రి సమయంలో భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఓఆర్‌ఆర్‌ హిమాయత్‌సాగర్‌ నుంచి భారీ వాహనాలు ప్రతిరోజు యూనివర్సిటీ ప్రధాన రహదారి గుండా భవానీ కాలనీ, శివరాంపల్లి వైపు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. రోడ్డు చిన్నదిగా ఉండటంతో రాకపోకల సమయంలో ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడుతుందని తెలిపారు. ఈ దారి గుండా భారీ వాహనాలను నిషేధించాలని గతంలో ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులతో పాటు యూనివర్సిటీ అధికారులను కలిసి విన్నవించామన్నారు. స్పందించకపోవడంతో తామే స్వయంగా భవానీ కాలనీ వద్ద భారీ వాహనాలు వెళ్లకుండా గేట్‌ను ఏర్పాటు చే శామని తెలిపారు. ఆ సమయంలో పోలీసులు జోక్యం చేసుకొని గేట్‌ను తొలగించారన్నారు. రోజురోజుకు ఈ రహదారి గుండా రాకపోకలు అధికమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. రాత్రి సమయంలో భారీ వాహనాలు నెమ్మదిగా వెళుతూ ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడుతుందన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల హారన్‌లతో ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. ఈ విషయంలో ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌, యూనివర్సిటీ అధికారులు స్పందించాలని కోరారు.

పిచ్చిమొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌

రాజేంద్రనగర్‌: విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని రాజేంద్రనగర్‌ డివిజన్‌ వాసులు కోరుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని కోరారు. బుద్వేల్‌ బన్సీలాల్‌నగర్‌ ప్రధాన రహదారి, జలమండలి కార్యాలయం, రాజేంద్రనగర్‌, గ్రీన్‌ సిటీ ప్రాంతాల్లోని విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోయాయి. పిచ్చి మొక్కల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌ కనిపించడం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వర్షంతో పాటు ఈదురు గాలులకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశముంది. విద్యుత్‌ శాఖ అధికారులు, సిబ్బంది రోడ్లపై విద్యుత్‌ వైర్లకు అడ్డంగా ఉన్న తీగలను గత నెలలో తొలగించారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు పెరిగిన వాటిని తొలగించలేదు. విద్యుత్‌ శాఖ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



జలమండలి కార్యాలయం ఆవరణలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన పిచ్చి మొక్కలు